# కొత్త జీవితం

ఎన్.శివనాగేశ్వరరావు




రాజశేఖరానికి జీవితం ఎంతో విసుగ్గా అనిపిస్తున్నది. రోజులు భారంగా గడుస్తున్నాయి. అతను జీవితాన్ని ఇంత నిస్సారంగా ఎన్నడూ గడిపింది లేదు.

రాజశేఖరం బ్యాంక్ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. అతను రిటైరై ఆరు నెలలు గడిచాయి. అంతవరకూ బిజీగా గడిపిన అతనికి రిటైర్‌మెంట్ జీవితం పరమ బోర్‌గా అనిపించసాగింది. రిటైర్‌మెంట్ తీసుకుని ఎన్నో సంవత్సరాలు గడిచిన అనుభూతి కలిగింది అతనికి.

బ్యాంకు ఉద్యోగంలో ఉండగా అతను ఉదయం తొమ్మిది గంటలకే ఆఫీస్‌కి బయలుదేరిపోయేవాడు. మళ్లీ ఇంటికి చేరేసరికి రాత్రి ఎనిమిది దాటేది. బిజినెస్ టార్గెట్స్, స్టాఫ్ ప్రాబ్లెమ్స్, కస్టమర్ కంప్లయింట్స్‌తో అతనెంతో ఛాలెంజింగ్‌గా ఉద్యోగబాధ్యతలు నిర్వర్తించేవాడు.

అటువంటిది ఒక్కసారిగా రోజంతా విశ్రాంతి అనేసరికి అతనికి ఏం తోచడం లేదు. ఉదయం వాకింగ్ నుంచి రాగానే కాఫీ తాగుతూ దినపత్రికలు తిరగేస్తాడు. తరువాత స్నానం చేసి బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటాడు. కొంచెంసేపు టీవీ చూస్తాడు. తరువాత ఏం తోచక భార్య అరుంధతికి సాయం చేయడానికి కిచెన్‌లోకి వెళ్లేవాడు. 'జీవితాంతం ఆఫీస్ చాకిరీ చేసారు. ఇప్పుడైనా విశ్రాంతి తీసుకోండి' అంటూ అరుంధతి అతన్ని కిచెన్ నుంచి బయటకు పంపేది.

కొంచెంసేపు ఫోన్లు మాట్లాడుతూ కాలక్షేపం చేసేవాడు. అతనికి సాహిత్యంలో మంచి పరిచయం ఉంది. అప్పుడప్పుడూ కొని దాచుకున్న పుస్తకాలు చదివేవాడు. అయినా ఇంకా సమయం మిగిలేది. భోజనం అయ్యాక కొంచెంసేపు నిద్ర... సాయంత్రం పూట పెరడులోని మొక్కలకు నీళ్లు పోసేవాడు. అయినా తోచేది కాదు.

అందుకే సాయంత్రం వాహ్యాళి అలవాటు చేసుకున్నాడు. కొందరు రిటైర్ అయిన ఉద్యోగులు కలిసేవారు. కొంచెంసేపు కాలక్షేపం చేసేవాడు. మళ్లీ ఇంటికి రాక... స్నానం... టీవీ వీక్షణం... భోజనం... మళ్లీ నిద్ర. అతనికి జీవితం నిస్సారంగానూ, విసుగ్గానూ అనిపించసాగింది.

రాజశేఖరం దంపతులకు ఒక్కడే కొడుకు. పేరు అక్షయ్. అతడు ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడే ఉద్యోగం సంపాదించాడు. ఇండియా అమ్మాయిని పెళ్లిచేసుకుని అమెరికాలో స్థిరపడిపోయాడు.

రిటైరైన తరువాత తండ్రి జీవితాన్ని బోరుగా ఫీలవుతున్న విషయం తెలుసుకున్న అక్షయ్ తల్లిదండ్రులు అమెరికా రావడానికి టికెట్లు బుక్‌చేసి పంపాడు.

కొద్దిరోజులు ఉత్సాహంగా గడపడానికి రాజశేఖరం, భార్యతో కలిసి అమెరికా చేరాడు. అయితే అక్కడి వాతావరణం అతనికి సరిపడలేదు. అక్కడి కల్చర్ అసలు నచ్చలేదు. అందుకే నెలరోజులకు తిరుగు ప్రయాణం టికెట్ సంపాదించి భార్యతో సహా ఇండియా చేరాడు.

ఇప్పుడు ఒక విషయమై అతని మనసులో దిగులు చోటు చేసుకుంది. రిటైర్ అయిన ఆరు నెలలకే జీవితం ఇంత నిస్సారంగా ఉంటే శేష జీవితం గడపడం ఎలా? ఆ ప్రశ్నకు సమాధానం దొరక్క అతని మనోవ్యథ మరింత పెరిగింది.

అలా మరో ఆరు నెలలు గడిచాయి. ఉద్యోగంలో ఉండగా ఎంతో హుషారుగా, ఉత్సాహంగా ఉండే తను నీరసంగా, నిరుత్సాహంగా మారడం అతను గమనించాడు. అయితే దాన్ని ఎలా అధిగమించాలో అతనికి బోధపడలేదు.

భర్తలో వస్తున్న మార్పులు అరుంధతి గమనిస్తూనే వుంది. ఆమె అతనికి బోరు కొట్టకుండా ఉండడానికి ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉండేది. అది కూడా అతనికి సాంత్వన కలిగించలేదు.

ఒకరోజు సాయంత్రం రోజూలాగే రాజశేఖరం వాహ్యాళికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిందా సంఘటన. ఒక తల్లి తన అయిదేళ్ల పాపను కొడుతుంటే ఆ పాప భయంతో పారిపోయి వచ్చి అటుగా వస్తున్న రాజశేఖరం కాళ్లకు చుట్టుకుపోయింది.

ఆ పాపను లాగుతూ కొట్టబోతున్న తల్లిని రాజశేఖరం వారిస్తూ "ఎందుకమ్మా! పసిదాన్ని అలా బాదుతావు?" అని మందలించాడు.

"మీకేం తెలుసు సార్! ఎన్నిసార్లు చెప్పినా ఇంగ్లీష్ స్పెల్లింగ్స్ తప్పులు రాస్తున్నది. స్కూల్‌కి వెళ్లినప్పుడు అక్కడి టీచర్స్ నన్ను మందలిస్తున్నారు. నాకెంత షేమ్‌గా వుందో" అన్నదా తల్లి.

"కొట్టినంత మాత్రాన చదువు తలకెక్కుతుందా?" అన్నాడు రాజశేఖరం.

తనను లాగుతున్న తల్లితో పాప- "నేను నీ దగ్గరకు రాను. తాతయ్యతో వెళ్తా" అని భయంగా చూసింది.

రాజశేఖరం పాపను ఎత్తుకుని "మా ఇల్లు ప్రక్కవీధిలోనే. కొంచెంసేపు పాప నా దగ్గర ఉంటుంది. నేను తీసుకొచ్చి అప్పగిస్తాను" అన్నాడు.

అతను బ్యాంక్ ఆఫీసర్‌గా చేసి రిటైరైన సంగతి పాపతల్లికి తెలుసు. "తీసుకెళ్లండి" అని ఇంటిలోకి పోయింది.

రాజశేఖరం పాపను ముద్దుచేస్తూ "నీ పేరేంటమ్మా" అని అడిగాడు.

"అవంతి" చెప్పింది పాప.

ముద్దులొలికే పాప మాటలు అతనికి నచ్చాయి.

భర్తతోపాటు వచ్చిన పాపను చూసిన అరుంధతి మురిపెంగా నవ్వుతూ "ఎవరీ అమ్మాయి?" అని అడిగింది.

"పేరు అవంతి.. నా చిన్నారి నేస్తం" నవ్వుతూ చెప్పాడు రాజశేఖరం.


అతను కుర్చీలో కూర్చుని పాపను తన ఒడిలిలో కూర్చోబెట్టుకుంటూ "ఏం తప్పులు రాసావని అమ్మ నిన్ను కొట్టింది?" అని అడిగాడు.

"సెప్టెంబర్. అదేమో పెద్ద స్పెల్లింగ్. ఎన్నిసార్లు చదివినా మరిచిపోతాను" చెప్పింది పాప.

"నీవు మర్చిపోకుండా ఎప్పుడు అడిగినా తప్పుపోకుండా కరెక్ట్ స్పెల్లింగ్ చెప్పడం ఎలానో నేను నేర్పుతాను" అన్నాడు రాజశేఖరం.

"నేర్పించు తాతయ్యా! అప్పుడు మమ్మీ నన్ను కొట్టదు" అంది పాప.

రాజశేఖరం సెప్టెంబర్ పదాన్ని సెప్-టెమ్-బర్‌గా ఎలా విడగొట్టాలో, ఎలా స్పెల్లింగ్ గుర్తుంచుకోవాలో ఒకటికి రెండుసార్లు చెప్పాడు. పాప మననం చేసుకుని తప్పుపోకుండా స్పెల్లింగ్ చెప్పింది. "గుడ్" అంటూ మెచ్చుకున్నాడు రాజశేఖరం.



"ఇలా చెప్పాలని టీచర్స్‌గానీ మమ్మీడాడీగానీ చెప్పలేదు తాతయ్యా! నువ్వు నాకు నచ్చావు" పాప రాజశేఖరం బుగ్గ ముద్దాడింది.

"ఇదిగో చాక్లెట్. తిను" అరుంధతి- అవంతికి అమెరికా నుంచి తెచ్చిన చాక్లెట్ ఒకటి అందించింది. పాప కొంచెంసేపు వాళ్లతో కబుర్లు చెప్పి "బై తాతయ్యా, బై అమ్మమ్మా" అని వెళ్లిపోయింది.

రాజశేఖరానికి ఆరోజెందుకో సంతోషంగా గడిపిన ఫీలింగ్ కలిగింది. మరుసటి రోజు వాహ్యాళికి వెళ్లివస్తూ పాపకోసం చూసాడు. కనిపించలేదు.

నాలుగు రోజుల తర్వాత ఒకరోజు అవంతి భుజానికి చిన్న బ్యాగ్ తగిలించుకుని రాజశేఖరం ఇంటికి వచ్చింది. "హాయ్ అవంతీ!" అని రాజశేఖరం పాపను హుషారుగా పలకరించి ''భుజానికా బ్యాగ్ ఏమిటి?" అని అడిగాడు.

''హోంవర్క్ నీ దగ్గర చేద్దావని వచ్చాను తాతయ్యా! నువ్వయితే కొట్టకుండా చక్కగా అర్థమయ్యేలా చెప్తావు" అంది పాప.

"ఓ యస్. అలాగే కానీ" అన్నాడు రాజశేఖరం. అతనికా పాపతో సమయం గడపడం ఇష్టంగా అనిపించింది.

అవంతి అరగంటలో హోంవర్క్ చేసేసింది. తెలియని వాటికి రాజశేఖరం సులభరీతిలో సమాధానాలు అర్థమయ్యేలా చెప్పాడు. అవంతి స్కూల్‌బ్యాగ్ సర్దేసి అరుంధతి ఇచ్చిన జంతికలు తింటూ, టీవీ చూస్తూ వాళ్లతో కబుర్లు చెబుతూ సమయం గడిపి వెళ్లిపోయింది.

అవంతి వెళ్లాక అరుంధతి, భర్తతో- "చాలా కాలం తరువాత మీరు సంతోషంగా కనిపించారు" అంది.

"నిజం. అక్షయ్-కోడలితో కలిసి ఇండియా వచ్చేసి ఇక్కడ స్థిరపడితే బావుణ్ను. వాళ్లకు పుట్టే పిల్లలతో మనకు మంచి కాలక్షేపం" అన్నాడు రాజశేఖరం.

"వాడికి ఇండియా వచ్చే ఉద్దేశం లేదు. మనకా

అదృష్టం లేనట్టే" అంది అరుంధతి.

పది రోజులు గడిచేసరికి అవంతి, రాజశేఖరం దంపతులకు బాగా దగ్గర అయింది. సాయంత్రం ఏడయ్యేసరికి రాజశేఖరం, పాప కోసం ఎదురుచూడసాగాడు. ఎప్పుడైనా అవంతి రాకపోతే ఆరోజు ఏదో వెలితిగా ఉండేది.

నెల తరువాత ఒకసారి అవంతి తనతోపాటు ఒక బాబును తెచ్చింది.

"ఎవరీ బాబు?" అడిగాడు రాజశేఖరం.

"మా పక్కింటి అబ్బాయి. వీడికసలు మేథ్స్ రావు. అందుకే నీ దగ్గరకు తెచ్చాను" అంది అవంతి.


"నీ పేరేంటి?" బాబును అడిగాడు రాజశేఖరం.

"అనిల్" బిడియంగా చెప్పాడు బాబు.

రాజశేఖరం ఆరోజు అవంతితోపాటు అనిల్‌కి పాఠాలు చెప్పాడు.

మెల్లమెల్లగా అవంతి, అనిల్‌తోపాటు మరికొందరు పిల్లలు అతని దగ్గర పాఠాలు చెప్పించుకోవడానికి రాసాగారు.

అదేమీ రాజశేఖరానికి విసుగ్గా అనిపించలేదు.




ఆనందంగా అనిపించింది. వాళ్లతో రాజశేఖరం ఇల్లు కళకళలాడసాగింది. రాజశేఖరం వాళ్లకు పాఠాలు చెబుతూ ఉల్లాసంగా, ఉత్సాహంగా సమయం గడపసాగాడు.

కాలనీలోని పిల్లల తల్లిదండ్రులు కొందరు రాజశేఖరాన్ని కలిసి "మీ దగ్గరకు వచ్చాక మా పిల్లలు చదువులో ప్రతిభ కనబరుస్తున్నారు. మీకు కృతజ్ఞతలు" అని చెప్పివెళ్లిపోయారు. రాజశేఖరానికి సంతోషంగా అనిపించింది.

రాజశేఖరం జీవితంలో చోటు చేసుకున్న మార్పులు గురించి తెలుసుకున్న మిత్రులు "పిల్లలకు అంత బాగా పాఠాలు చెబుతున్నావు. మరెందరికో ఉపయోగపడేలా 'సులభరీతిలో పాఠ్యాంశాల బోధన' అన్న విషయంపై చిన్న చిన్న పుస్తకాలు రాయకూడదూ?" అని ప్రోత్సహించారు.

రాజశేఖరానికి ఈ సలహా నచ్చింది. శ్రీకారం చుట్టాడు. కొన్ని పుస్తకాలు ప్రచురించాడు. వాటికి మంచి ప్రతిస్పందన వచ్చింది. వార్తాపత్రికల్లోనూ, టీవీ చానెల్స్‌లోనూ వాటిని బాగా హైలైట్ చేసారు. రాజశేఖరానికి మంచిపేరు, గుర్తింపు వచ్చింది. అతనికి సంతృప్తిగా అనిపించింది.

ఆరోజు స్వాతంత్ర్య దినోత్సవం.

రాజశేఖరం స్నానం చేసి కాఫీ తాగుతూ పేపర్ చదువుతున్నాడు. గేటు చప్పుడైతే తలతిప్పి చూసాడు.

అతని దగ్గర పాఠాలు చెప్పించుకోవడానికి రోజూ వచ్చే పిల్లలందరూ చేతుల్లో చిన్న చిన్న జెండాలు పట్టుకుని వరుసలో నడుస్తూ రాజశేఖరం దగ్గరకు వచ్చారు. తమ చిన్నారి చేతులతో రాజశేఖరానికి జెండాలు, చాక్లెట్లూ అందిస్తూ అతని బుగ్గమీద ముద్దులవర్షం కురిపించారు.

ఆ పిల్లలు, రాజశేఖరానికి తన జీవితం ఆనందమయం చేయడానికి వచ్చిన దేవదూతల్లా కనిపించారు.

అరవై సంవత్సరాల వయసు దాటాక రాజశేఖరానికి ఒక విషయం అర్థమైంది. జీవితం రొటీన్‌గా, యాంత్రికంగా అనిపించినప్పుడు చిన్న చిన్న మార్పులు చేసుకోగలిగితే అదే జీవితం అర్థవంతంగానూ, ఆనందమయంగానూ మారుతుందని.

రాజశేఖరానికి ఇప్పుడు రిటైర్‌మెంట్ జీవితం ఏమాత్రం విసుగు అనిపించడం లేదు. సాధించవలసిన లక్ష్యాలు కళ్లముందు కదలాడుతున్నాయి.

○



## నా గ్లామరే వేరు

పాత్రకోసం అవసరమైతే ఆంటీలాంటి గెటప్ వేస్తానుగానీ, నన్ను మాత్రం ఆంటీలా వున్నావంటే అస్సలు ఒప్పుకోను- అంటోంది విమలారామన్. చూడగానే కాస్త 'వయసు'న్న హీరోయిన్‌లానే కనిపిస్తుందని, కుర్రహీరోలకు జంటగా విమలా రామన్ బాగోదని, కాస్త ఏజ్డ్ హీరోల సరసన అయితేనే నప్పుతుందనే టాక్ సినీజనాల్లో వుండడంతో ఇలా గయ్యిమందీమధ్య. అవసరమైతే పాత్రపరంగా ఎక్స్‌పోజింగ్ చేయడానికి సిద్ధమవుతున్న విమలా రామన్‌కి టాలీవుడ్‌లో ప్రస్తుతం 'రంగ ది దొంగ' రిలీజ్ కావాల్సి వుంది.